అద్వితీయం

కె. గోదావరి శర్మ

నెల్లాళ్ల నుంచి ఏకధాటిగా వచ్చే చుట్టాలూ వెళ్లే చుట్టాలూను. ఊపిరి సలపలేదు విజయకి ఆఖరి బేచ్ ఇదిగో నిన్న రాత్రి వెళ్లేరు. ఇల్లంతా ఎలా ఉండాలో అలా ఉంది. గాలివాన వెలిశాక పూలతోట ఎలా ఉంటుందో అలా ఉంది. ఉదయం మొగుణ్ని ఆఫీసుకి పంపించి ఇల్లు సర్దే కార్యక్రమం ప్రారంభించింది విజయ. నెల్లాళ్ల పాటు బంధువుల తాకిడిని భరించిన ఇంటిని ఓ కొలిక్కి తేవాలంటే మాటలా? అసలే ఆమెకి నీటూ గోటూ ఎక్కువ. పిల్లలుగల ఇల్లయితే అడివిలా సహజసుందరంగా ఉంటుంది గాని పిల్లలులేని ఇల్లు జాగ్రత్తగా పెంచుకునే - పూలతోటలా ఉంచుకోవచ్చు- ఇల్లాలికి ఒళ్లు వంగాలే గాని. విజయకి ఒళ్లు బాగానే వంగుతుంది. ఇంకా పిల్లాజెల్లా లేరు కాబట్టి ఇల్లు చక్కబెట్టుకోవడానికి బోలెడు కోరికా తీరికా ఓపికా కూడా ఉన్నాయి ఆమెకి. కాని ఇదిగో ఈ నెల్లాళ్ల నుంచి ఇంట్లో పిల్లలు లేరన్న లోటు తీర్చేశారు చుట్టాల పిల్లలు. అద్దంలాంటి ఇల్లు అడివిలా చేసేశారు. వాళ్లంతా కిష్కింధాపుర అగ్రహారికులు వాళ్ల ఇళ్ళల్లో అయితే తల్లితండ్రికి భయపడతారు గాని కొత్తచోట, కొత్త వాళ్ల ఎదుట ఏమి అనరని వాళ్లకి ధైర్యం ఆవిధంగా పెద్దవాళ్లు ఇల్లు గుల్లచేస వెళితే పిల్లలు ఇల్లు తీసి పందిరేసి వెళ్లేరు

ఎక్కడి సామాన్లు అక్కడ సర్ది గదులన్నీ తుడుచుకొచ్చే సరికి నడ్డి విరిగిపోయింది విజయకి కళ్ల మీదకి నిద్రకూడా కూరుకొచ్చింది కాని ఈ ఇంతపనీ వెనకపెట్టడం ఎందుకని, భర్త టేబులూ పుస్తకాలూ కాగితాలూ కూడా సర్దేసి ఏకంగా పడుకోవచ్చుని ఆ పని మొదలెట్టింది టేబులు సొరుగులో కాగితాలు పైకి తీసి సర్దుతూండగా ఒక నోట్‌బుక్ ఆమె కంట పడింది తీసి చూస్తే అది పద్మనాభరావు జాతక పుస్తకం మొదటి పేజీల్లో రా

చక్రం, అంశచక్రం, లగ్న పత్రిక, తరవాత పేజీల్లో దశాభుక్తి శేషాలు, గ్రహచారమూ, జీవితాంతం శుభాశుభ ఫలితాలూ అన్నీ క్రమంగా రాసి పెట్టి ఉన్నాయి. విజయకి ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే పెళ్ళయిన ఈ మూడున్నర ఏళ్ళలోనూ భర్త ఎప్పుడూ దీన్ని తనకి చూపించలేదు దీని సంగతి తనకి చెప్పనైనా లేదు పోనీ అతడికి ఈ జ్యోతిష ఫలితాల్లో ఆసక్తి నమ్మకమూ లేవా అంటే, ఆ ప్రసంగం ఏదైనా వస్తే ఎంతో భక్తి శ్రద్ధలతో మాట్లాడతాడు, జాతక ఫలితాలు, గ్రహబలాలు, ముహూర్త బలాలూను జాతకాలంటే చాల గురి ఉంది. మరి?

నిద్ర ఎక్కడి దక్కడ ఎగిరి పోయింది కనక, చేతిలో పని పక్కన పెట్టి ఫ్యాను వేసుకుని ముందు ఆ పుస్తకమంతా చదివింది విజయ

పద్మనాభరావు మహాజాతకుడేమీ కాదు అలా అని నష్టజాతకుడూ కాదు మామూలు మధ్య తరగతి మనుషులందరి జీవితాల్లో లాగే అతడి జీవితంలోనూ మామూలు మిట్టపల్లాలే ఉన్నాయి. జ్యోతిష పరిభాషలో చెప్పాలంటే శుభాశుభ మిశ్రమ ఫలితాలు అలా చదువుతూండగా ఒక వాక్యం దగ్గర ఆమె కళ్ళు ఆగిపోయాయి. పద్మనాభరావుకి ద్వితీయ కళత్రయోగం ఉంది!

ఒక్కసారి కళ్ళు తిరిగి నట్టనిపించింది ఆమెకి అంటే... అంటే .... తను మొదటి కళత్రం! ఇక ద్వితీయ కళత్రం అంటే ... తను చచ్చిపోతుందా? తను పోయాక భర్త మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడా? లేక..... లేక .. తను ఉండగానే వేరే ఎవర్తినో –

ఆ ఆలోచన వచ్చి రావడంతోనే విజయ మనసు గుబగుబ లాడిపోయింది అరికాళ్ళకింద మంటలు పుట్టినట్టు లేచి ఆగదిలోంచి ఈ గదిలోకి ఈ గదిలోంచి ఆ గదిలోకి తిరిగేసింది డ్రెస్సింగ్ టేబులు ముందు నిలబడి అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకోగానే ఆమెకి పుట్టెడు దుఃఖం వచ్చేసింది ఎంతో కష్టంలో ఉన్న తనని తన ప్రతిబింబం

అద్వితీయం

సానుభూతిగా చూసి ఓదారుస్తున్నట్టని-పించింది ఈ గదిలో ఈ అద్దంముందు – ఇంకెవర్తెనా? విలాసంగా, సగర్వంగా పైట సర్దుకుంటూనా? వెనక నుంచి వచ్చి తన భర్త – దాని బుజాలమీద చేతులు వేసి– ముందుకి వంగి దాని తల్లో పూలని ఆఘ్రాణించి– దాని ముఖం తన వైపుకి తిప్పుకుని– తనకిచ్చినట్టే–

ఇక దుఃఖం పట్టలేక మంచం మీద బోర్లాపడి భోరున ఏడ్చేసింది విజయ

కొంత సేపయ్యాక, గుండెల్లోని ఉద్వేగం కొంత ఉపశమించాక, ప్రశాంతంగా ఆలోచిస్తే తన భయం అర్థం లేనిదనిపించింది. ఛ! ఎంత సిల్లీగా, చదువులేని దానిలా, ఆలోచించింది తను! నిజానికి చాలా మంది మొగుళ్ళలాగే తన భర్తా శ్రీరామచంద్రుడు! ఏక పత్నీ వ్రతమనీ, అదొక నియమమని, దాన్ని దీక్షగా పాటించే నిష్ఠాపరుడనీ కాదు– ఇద్దరు పెళ్ళాలని మెయింటైన్ చేసే సత్తా అతడికి లేదు, ఏ విధంగా చూసినా పాపం పద్మనాభరావు మధ్య తరగతి మానవుడు! ఉద్యోగం చేసి డబ్బు సంపాదించి చన్నీళ్ళకి వేణ్ణీళ్ళు తోడు చేసి. నాజూగ్గా సరసంగా తనతో సినిమాలకి షికార్లకి రావడానికి ఒక శ్రీమతి, ఇంటి పట్టునే ఉండి వంటా వార్పూ ఇల్లూ పిల్లలూ చూసుకుంటూ నోములూ వ్రతాలూ చేసుకునే ధర్మపత్ని ఒకతి– వెరసి ఇద్దరుంటే బాగానే ఉంటుందన్న కోరిక మనసులో ఎక్కడో ఉన్నా, ఆ సరదా తీరేది కాదు కనక, నిజ భార్యనే యధాశక్తి "ఇలలో నీవె ప్రేయసివే, కలలో నీవె ఊర్వశివే" అన్నట్టు నిజాయితీగా ప్రేమించు కొస్తున్నాడు మరో ఆడదాన్ని– కంటి కెదురైతే కంటితో చూడడం, ఆవిడ వంటికున్న చీర లాంటిది తన భార్యకి కొంటే బాగుంటుందను కోవడం మినహా ఇంకేమి ఆలోచించే, ఆశించే తత్వం కాదతడిది ఈ

విషయాలన్నీ విజయకి స్పష్టా స్పష్టంగా తెలుసు తనుండగా తన భర్త మరో స్త్రీని కోరుకోవడం జరగదు.

తను చచ్చిపోయాక చేసుకుంటాడా? తను చచ్చిపోయాక ఇక ఎవరు ఏం చేస్తే తన కేమిటి? తనకి తెలియదు కదా! బాధ ఉండదు కదా! కాని ప్రస్తుతం బాధగా ఉంది, ఆ తలపే ఆలోచిస్తే, నిజమే, తనుపోయాక ఆయన మరొకర్తిని చేసుకుని ఎందుకు సుఖపడ కూడదు? తన కేమిటి నష్టం? విజయకి ఏదో త్యాగం చేసిన గొప్ప ఫీలింగూ కలిగింది, తన సొమ్ము ఎవరో లాక్కు పోతున్నట్టు బాధాకలిగింది.

హఠాత్తుగా విజయ మెదడు చురుగ్గా పని చేసింది గత మూడున్నర ఏళ్ళలోనూ పద్మనాభరావు ఇద్దరు పెళ్ళాల విషయమై అప్పుడప్పుడు ఆడిన మాటలన్నీ ప్రతిభావంతుడైన ఫిలిం ఎడిటర్లా ఏర్చి కూర్చింది. తన జ్ఞాపక శక్తికి తనే ఆశ్చర్యపోతూనే ఆ సంభాషణా శకలాల నన్నిటినీ ఓ వరసక్రమంలో పెట్టి చూసుకుంది రేడియోలో "పెళ్ళయిన వాణ్ణి జంకమాకు, ఒకరికి ఇద్దరైతే వేడుకలే" అన్న పాట విన్నప్పుడు, వారపత్రికల్లో ఒక హీరో– ఇద్దరు హీరోయిన్ల సీరియల్ నవలలు చదివినప్పుడు, ఇతరత్రా అతడు చేసిన కామెంట్లన్నీ మననం చేసుకోగా–

"అమ్మో, నమ్మ కూడదు ఈ మగాళ్ళని" అనిపించింది అమెకి పద్మనాభరావు మేదకుడే కావచ్చు, తనని సిన్సియర్‌గానే ప్రేమిస్తూ ఉండి ఉండవచ్చు, ఇప్పట్లో రెండో పెళ్ళి ఉద్దేశ్యం ఏదీ అతనికి లేకపోనూ వచ్చు! కాని, కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కద! పైకి తేలకపోయినా, సబ్ కాన్షస్‌గా లోపలెక్కడో అతడికి సుముఖత ఉండే ఉంటుంది సమయం, సందర్భం వచ్చినప్పుడు అది పైకి వస్తుంది. పైగా ఈ జాతకం ఒకటి! స్పష్టంగా ద్వితీయ కళత్రయోగం అని రాసి ఉంది, ఇందులో! దీన్ని అతడు తప్పక సీరియస్‌గా తీసుకుంటాడు నిశ్చయమే అని నమ్ముతాడు తన కిష్టం ఉన్నా లేకపోయినా రెండో పెళ్ళి తప్పదని, జాతకంలో ఉన్నట్టు జరగక తప్పదనీ అనుకుంటున్నాడేమో! తనకి తెలియకుండానే దానికి క్రమంగా సిద్ధపడు తున్నాడేమో! అసలందుకే ఇంతవరకు తనకి పుస్తకం చూపించ లేదు తను భరించలేదని! అంగీకరించదని! కాని తమ ఇద్దరి ఇష్టా యిష్టాలతో ప్రమేయం లేకుండా జరగవలసిన దేదో జరిగి తీరుతుందని అతడి నమ్మకమా?

విజయకి భర్తమీద కోపం, విసుగు, చికాకు కలిసి వచ్చాయి ఏమిటీ మనిషి! ఏవో అర్థం పర్థం లేని జ్యోతిష్యాలని నమ్ముతాడు! ఇన్నాళ్ళూ పోనీలే, అతడి నమ్మకాలు అతడివి, ఎవరి వెర్రి వారి కానందం అని ఊరుకుంది. కాని ఈ జాతకాల పిచ్చి వల్ల తన కాపురానికే కీడు మూడుతూందే!

ఏం చెయ్యాలి? నిలదీసి అడిగెయ్యాలా, ఏమిటి మీ ఉద్దేశ్యమని? రెండో పెళ్ళికి రెడీగా ఉన్నారా అనో, ఎవర్తయినా ఇంకా జతపడ్డదా లేదా అనో అడిగి,



కడిగి ఎండేసెయ్యాలా?

మరుక్షణం తన తొందరపాటుకి తనే సిగ్గు పడ్డది విజయ. తను ఆవేశంలో, తన కేదో అన్యాయం జరగబోతున్నదన్న భయంతో, భ్రమతో, ఉన్నీ లేనివీ ఊహిస్తున్నదేమో! భర్త తను అనుకుంటున్నంత సీరియస్‌గా ఇవేవీ నమ్మడం లేదేమో! తను అడిగితే, పిచ్చి, అలాంటి ఆలోచనలూ మాటలూ ఇంకెప్పుడూ రానివ్వకని కాజువల్‌గా తీసి పారేస్తాడేమో! ఎలా నమ్మడం? ఆ మాటలు నిజమో నటనో! నిజమే అయితే ఈ పుస్తకం తన నుండి దాచడం ఎందుకు?

విజయకి ఏమీ పాలుపోవడం లేదు. ఏం చెయ్యాలి? ఏదో చెయ్యాలి! తొందర పడకూడదు. ఆలస్యమూ చేయకూడదు. ఉద్రేక పడకూడదు, ఉపేక్షించనూ కూడదు. చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టమన్నారు కాని ఒడుపు చూసి కొట్టకపోతే కాటు తినవలసి వస్తుంది. ఇంతకీ– అది తాడో పామో! ముందు తెల్సుకోవాలి. తాడుని కొట్టడం తెలివి తక్కువ. పాముని కొట్టక పోవడం ప్రమాదం.

తటిల్లతలా ఓ ఆలోచన విజయ మెదడులో మెరిసింది. దాన్ని గురించే ఆలోచిస్తూ యాంత్రికంగా మిగతా సర్దడం అంతా పూర్తి చేసింది. ఆ జాతక పుస్తకాన్ని యథాస్థానంలో ఉంచేసింది.

* * * *

వారం రోజుల తరవాత పద్మనాభరావు ఆఫీసుకి బయలుదేరుతూ ఫైలులో ఈ పుస్తకం కూడా పెట్టుకోవడం చూసీచూడనట్టు ఓరకంట చూసింది విజయ.

"సాయంత్రం తొందరగా వచ్చేస్తారా?" అని అడిగింది.

"ఉహుఁ! కొంచెం లేటవుతుంది. ప్రభాకర్‌తో కలిసి ఒకరి దగ్గరకి వెళ్ళాలి" అన్నాడు పద్మనాభరావు, షర్టు వేసుకుంటూ.

"ఎక్కడికి?"

"ఉన్నాడులే ఈ ఊళ్ళో ఒకాయన. జ్యోతిష శాస్త్రంలో మంచి గట్టివాడట. పోనీ ఓసారి చూద్దామని...."

"ముసలాళ్ళలాగా అప్పుడే మీ కి జాతకాల పిచ్చి ఏమిటండీ?" అని కొంచెం విసుగు నటించింది విజయ. "అయినా మీకు చాలదన్నట్టు ప్రభాకరన్నయ్య గారికి ఎప్పటి నుంచి? మీరే అంటించారా ఆయనక్కూడా?" అంది.

నవ్వేసాడు పద్మనాభరావు. "నేను కాదు. అతనే చెప్పేడు నాకు స్వయంగా, ఈయన గురించి. నన్ను తీసుకెళతా నన్నాడు ఇవాళ!"

"ఏమో మీ ఇష్టం బాబూ! నన్ను అందులోకి లాగనంతవరకు మీ నమ్మకాన్ని నేనెందుకు కాదనాలి?" అంది విజయ, ఉదాసీనంగా.

పద్మనాభరావు ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

* * * *

రాత్రి బాగా చీకటి పడ్డాక తిరిగి ఇల్లు

అద్వితీయం

చేరుకున్నాడు పద్మనాభరావు. ఏదో ఆలోచిస్తూ నిశ్శబ్దంగా వచ్చి కుర్చీలో కూర్చున్న భర్తకి మౌనంగానే కాఫీ కప్పు అందించింది విజయ.

అతను కాఫీ తాగడం పూర్తయ్యాక, "వెళ్ళేరా?" అంది, కప్పు అందుకుంటూ.

"ఊఁ!"

"ఏమన్నారు?"

"ఏం లేదు. ఏవో చెప్పేరు. కాని ఆయన బాగా నిష్ణాతు లాగున్నాడు జ్యోతిషంలో "

విజయ ఏమీ మాట్లాడ లేదు.

"ఇంతకు ముందు నా దగ్గర ఉన్న జాతక చక్రం తీసుకు వెళ్ళి చూపించాను..... అందులో దోషం ఉందంటున్నారు...." తాపీగా అన్నాడు పద్మనాభరావు.

"దోషమా? కొంపతీసి ఏవో గండాలనీ గ్రహ శాంతులనీ అంటారా ఏమిటి?" కంగారు ప్రదర్శిస్తూ అడిగింది విజయ.

"అబ్బెబ్బే అదేం కాదు. అసలు జాతక చక్రమే, వెయ్యడం తప్పుగా వేసారట. జనన కాలాన్ని బట్టి చూస్తే గ్రహస్థితి ఇందులో ఉన్నట్టు ఉండదట. కొంచెం తేడా వస్తుందంటున్నాడు ఈయన!"

"అయితే?"

"మరేం లేదు. గ్రహస్థితి మారితే దానిని బట్టి ఫలితాలు కూడా మారుతాయి" సాలోచనగా అన్నాడు పద్మనాభరావు.

"పోనీ, ఏమీ చెడులేకుండా ఉంటే అంతే చాలు" ఆందోళన కనపరిచింది విజయ.

"చెడు ఏమీ లేదులే. ఒకరకంగా చెప్పాలంటే మంచే జరిగింది. పూర్వపు ఫలితాల కంటె ఇదే బాగున్నాయి. నాకూ నీకూ కూడా!"

"అదేమిటి? మీ జాతకంలో నా గురించి ఏం ఉంటుంది?" ఆశ్చర్యంగా అంది.

"బాగుంది. నువ్వు నా భార్యవైనప్పుడు నా జాతక ప్రభావం నీ మీద ఉండదూ? సప్తమ స్థానం కళత్ర స్థానమట. ఆ ఏడో ఇంట ఉన్న గ్రహానికి ఇతర గ్రహాలతో ఉండే సంబంధాన్ని బట్టి భార్య విషయం కూడా చెపుతారు.

"అయితే ఇప్పుడు నా విషయం ఏం చెప్పేరు?"

కొంచెం సేపు తటపటాయించాడు పద్మనాభరావు. చివరకి చెప్పేశాడు. "ఇంతక ముందు జాతకంలో గ్రహస్థితి ప్రకారం నాకు.... ద్వితీయ కళత్రయోగం ఉండవచ్చుని.... అహఁ, అంటే అలా అయిపోతుందని కాదు, గ్రహస్థితిని బట్టి చూస్తే అలా జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పుడు కొత్తగా వేసిన చక్రం ప్రకారం అలాంటిదేమీ లేదని తేల్చేశాడు ఈయన."

భర్తకి దగ్గరగా వచ్చి, అతడి చేతి మీద చెయ్యివేసి, "అందుకని పాపం, విచారంగా ఉందా?" అంది విజయ, సగం హాస్యం, సగం జాగ్రత్త మేళవించిన స్వరంతో

"ఛ ఛ! అదేమిటి విజయా, అలా అంటావు! నా కెప్పుడయినా అలాంటి ఆలోచన ఉందా చెప్పు? జాతకంలో ఉందన్నాను గాని.... అయినా నిన్ను తప్ప వేరే ఎవరినైనా కలలో నైనా స్మరిస్తానా చెప్పు" చాలా సిన్సియర్‌గానే అన్నాడు ఈ మాటలు, పద్మనాభరావు.

"ఛ! ఊరికే అన్నానండి! మీ సంగతి నాకు తెలియదూ?" అంది విజయ, అతడి తలమీద చెయ్యివేసి నిమురుతూ.

"ఇది వరకు జాతకం ప్రకారం అలాంటి అవకాశం ఉందంటే ఉందనుకున్నాం. అంతే. కాని ఆ అవసరం, ఆ పరిస్థితి ఎప్పుడూ రాదు మనకి. ఇప్పుడు ఆ భయం, ఆ అనుమానలేశం కూడా తీరిపోయింది కదా! సంతోషించక విచారం ఎందుకూ? నాకు మాత్రం అనవసరపు ఆలోచనలకి ఆస్కారం లేకుండా ఈయన ఇలా చెప్పడం హాయిగా ఉంది సుమీ!" అని కూడా అన్నాడు పద్మనాభరావు.

విజయ తేలిగ్గా నిట్టూర్చింది.

* * * * *

మరుసటి ఆదివారం ప్రభాకర్‌ని భోజనానికి పిలిపించింది విజయ. అతడు వచ్చాడు.

భోజనాలయ్యాక భర్తని వీధి చివర కిళ్ళీబడ్డీ దగ్గరకెళ్ళి కిళ్ళీలు, అరటిపళ్ళు తెమ్మని చెప్పి పంపించి, తను ప్రభాకర్‌తో మాట్లాడింది.

"సమస్య ఇంత సులువుగా పరిష్కారం అయిపోతుందనుకోలేదు అన్నయ్య గారూ! అంతా మీ చలవే" అంది కృతజ్ఞతతో.

"నా దేముందమ్మా! సమస్యా నీదే, పరిష్కారమూ నీదే. నేను నిమిత్తమాత్రుణ్ణి. మీ పనికి నేను పనికొచ్చాను. అంతే చాలు" అన్నాడు ప్రభాకర్.

"ఆ జ్యోతిష్కుడు గారెవరో ఈయన్ని బాగా ఇంప్రెస్ చేసినట్టున్నారే!" అంది విజయ, నవ్వుతూ.

"ఔను. నిజానికి ఆయన బాగా పేరున్న జ్యోతిష్కుడే. నేను ఇలా ఇలా అని విషయమంతా వివరించేసరికి మనతో సహకరించడానికి ఆయన ఒప్పుకున్నాడు. వెయ్యి అబద్ధాలాడైనా ఓ పెళ్ళి చెయ్యమన్నారు కాని పెళ్ళి చేసేసి చేతులు దులుపుకోగానే తీరిపోదు కదా పెద్దవాళ్ళ బాధ్యత! పెళ్ళి చెయ్యడం ఎంత ముఖ్యమో, పెళ్ళయ్యాక మొగుడూ పెళ్ళాలు సజావుగా సంసారం చేసుకుంటున్నారో లేదో కనిపెట్టి వాళ్ళకి అన్నివిధాలా సాయపడడం కూడా అంతే ముఖ్యం.

ఇద్దర్ని ఓ ఇంటి వాళ్ళని చెయ్యడానికి వెయ్యి అబద్ధాలాడడం తప్పు కానప్పుడు, ఆ ఇల్లు నిలబెట్టడానికి అన్ని అబద్ధాలూ ఆడవచ్చు అయినా మనం ఆడింది ఒకటే అబద్ధం. తప్పులేదు." అన్నాడు ప్రభాకర్.

ఎమ్మే చదువుకున్న విజయ, 'థాంక్స్' అనకుండ కృతజ్ఞతగా, ఆప్యాయంగా, తడి కంటితో అతడి వైపు చూసి చిరునవ్వు నవ్వింది.